ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

గురువారం 17 ఏప్రిల్ 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 25.0



ఢిల్లీలో కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు కొల్లేరు సమస్యలను వివరించి సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని, పత్సమట్ల

కొల్లేరుపై నివేదిక ఇవ్వండి

- 12 వారాల గడువు విధిస్తూ 'సీఈసీ'కి సుప్రీంకోర్టు ఆదేశాలు
- రెండు రోజులుగా ఎమ్మెల్యే కామినేని ఢిల్లీలో పెద్దలతో చర్చలు

కైకలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో గట్టి వాదనలు వినిపించింది. దీనిపై న్యాయమూర్తి నేషనల్ ట్రిబ్యునల్ బోర్డు గైడ్‌లైన్స్ అనుసరిస్తూ 12 వారాల్లో గ్రౌండ్ స్థాయి నివేదికను అందజేయాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఆదేశించారు. మూడు దశాబ్దాలుగా కొల్లేరు ప్రజలు పడుతున్న సమస్యలను పట్టించుకోకుండా పర్యావరణం అంటూ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశారని, వారికి కావాల్సిన అవసరాలను తీర్చలేదని, తినేందుకు తిండి లేక ప్రజలు పొట్ట చేత పట్టుకుని ఉపాధి కోసం వలసలు పోతున్నారని, గ్రామాల్లో వృద్ధులు, పిల్లలు పడుతున్న పాట్లు, కొల్లేరు ఆపరేషన్ అనంతరం అక్కడి ప్రజల జీవన స్థితిగతులను కోర్టుకు విన్నవించారు.

రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి..

ఇప్పటికే కొల్లేరు ప్రజల సమస్యలను ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించి న్యాయ పోరాటానికి సిద్ధమైంది. ఈ బాధ్యతను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని, ఎంపీ పుట్టా తీసుకున్నారు. ఎమ్మెల్యే కామినేని రెండు రోజులుగా ఢిల్లీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి కొల్లేరు సమస్యపై చర్చించారు. ఆయనతోపాటు సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ(సీఈసీ) సభ్యుడు గోయల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో కొల్లేరు సమస్యపై చర్చించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను సుప్రీంకోర్టులో న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. న్యాయమూర్తి నేషనల్ ట్రిబ్యునల్ బోర్డు గైడ్‌లైన్స్ అనుసరిస్తూ 12 వారాల్లో గ్రౌండ్‌స్థాయి నివేదికను అందజేయాలని సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఆదేశించారు. దీంతో కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి సీఈసీ కమిటీ ద్వారా కోర్టుకు అందజేయనున్నారు.

కొల్లేరు వాసుల హర్షం

సుప్రీంలో ప్రజల తరఫున మొదటిసారి వాదనలు వినిపించడం, కోర్టు గ్రౌండ్ నివేదిక కోరడంతో కొల్లేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు తమ గోడును పట్టించుకున్న నాథుడే లేడని టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుందని ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఢిల్లీలో కామినేని వెంట రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, నంబూరి శివాజీరాజు, వాసురాజు, కొల్లేరు సంఘ నాయకులు బలే ఏసురాజు, జయమంగళ సుబ్బరాజు, కొల్లి వరప్రసాద్, చింతలమూడి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



అన్నీ పాత భవనాలే..

శిథిల భవనాల్లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే వనరులుగా మాత్రమే మిగిలిపోతున్నాయి. బ్రిటీష్ కాలం నాటి పురాతన భవనాల్లోనే మగ్గుతున్నాయి. వర్షం కురిస్తే రికార్డుల గదుల్లోకి వర్షపు నీరు చేరుకునే దుస్థితి ఏర్పడుతోంది. మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేస్తామంటూ విద్యుత్ శాఖ అధికారులు అడపాదడపా నోటీసులు సైతం జారీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రయోగాలకు రిజిస్ట్రేషన్ శాఖ బలైపోయింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు చేస్తామంటూ గడిచిన ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌లు చేపట్టింది. జిల్లాలో దాదాపు 45 సచివాలయాలను ఎంపిక చేసింది. అక్కడ రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతను సబ్‌రిజిస్ట్రార్‌లకు అప్పగించింది. టార్గెట్‌లను నిర్దేశించింది. ఇలా ఎన్నో ప్రయోగాలతో సిబ్బంది విసిగిపోయారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్ పెట్టింది. సిబ్బంది ఇబ్బందులు అనేకం వెలుగులోకి వచ్చాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి ఫోకస్

- మౌలిక వసతులు నిల్.. వెంటాడుతున్న సిబ్బంది కొరత
- కనీస వసతుల కల్పనకు చర్యలు శూన్యం
- కార్యాలయాల్లో సిబ్బంది వెతలు వర్ణనాతీతం

నరసాపురంలో వర్షం వస్తే లీకేజీలు

నరసాపురం : జిల్లాలో అతి పురాతనమైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నరసాపురం ఒకటి. 1860లో నిర్మించిన కార్యాల యంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి పరిస్థితి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా.. వర్షం వస్తే లీకేజీలు తప్పవు. భవనం పైకప్పు ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం వెంటాడుతోంది. రికార్డు రూమ్‌కు భద్రత లేదు. కార్యాలయానికి సరైన రక్షణ గోడ లేదు, సీసీ కెమెరాలు లేవు. రాత్రి వాచ్‌మెన్ లేదు, పట్టణ, మండలానికి సంబంధించిన రికార్డు అంతా ఈ రూమ్‌లోనే ఉంటుంది. సిబ్బందికి సరైన వసతులు లేవు. మరుగుదొడ్లు, వాష్ రూమ్‌లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు సిబ్బంది కొరత వెంటాడుతోంది.

తణుకులో దెబ్బతిన్న కార్యాలయం



తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తణుకు : తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు 150 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. ప్రభుత్వాలు మారుతున్నా తణుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మంచి రోజులు రాలేదు. భవనం రూపు రేఖలు మారలేదు. ప్రస్తుత కార్యాలయం పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలో భవనం పైకప్పునుంచి లీకేజీలు అధికంగా ఉంటున్నాయి. వర్షపు నీరు కార్యాలయంలో కారుతుంటుంది. కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేవు. సిబ్బంది ఇబ్బందులు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని వదిలివేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అద్దె భవనంలోకి వెళ్లాలని ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో సాధ్యం కాలేదు.



తాడేపల్లిగూడెం రికార్డు గదిలో వర్షపునీటికి నల్లబడిన సీలింగ్

తాడేపల్లిగూడెంలో సమస్యల తిష్ట

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమస్యలతో సతమతమవుతోంది. కార్యాలయం పూర్వకాలం నిర్మించిన భవనంలో ఉండడం వల్ల వర్షం వస్తే అంతా చెమ్మ చేరిపోతోంది. రికార్డ్స్‌కు సరైన భద్రత కరువైంది. ఆ రికార్డు భద్రపరిచే ప్రాంతం సీలింగ్ అంతటా వర్షపు నీరు లీకేజీ అవుతోంది. గతంలో వర్షం కురిస్తే రికార్డుల గదిలోకి వర్షపు నీరు చేరిపోయింది. ఇటీవల మరమ్మతులు చేశారు. రికార్డులను కింద ఉంచకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికీ సీలింగ్ నుంచి నీరు లీకేజీ అవుతోంది. రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి కోసం మరుగుదొడ్ల సదుపాయం లేదు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల కొరత వెంటాడుతోంది. నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడే లేఖరులు ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఇటీవల దానిని కూడా వివాదాస్పదం చేశారు. అక్కడ చిన్నపాటి షెడ్డులను నిర్మించుకోవడానికి చర్యలు తీసుకుంటే ఇతర శాఖల అధికారులు అడ్డుకున్నారు.

పాలకొల్లులో పార్కింగ్ సమస్య



కక్షి దారుల వాహనాలతో రోడ్డు అంతా రద్దీ

పాలకొల్లు టౌన్ : పాలకొల్లు పట్టణంలోని సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం సుమారు 90 ఏళ్ల క్రితం నిర్మించినది. నూతన భవనం నిర్మించాల్సిన పరిస్థితి ఉంది. రిజిస్ట్రేషన్ కోసం నిత్యం వచ్చే కక్షిదారులు ఎండ, వానల్లోనే సిమెంట్ బెంచీలపై కూర్చుంటారు. ఇక కక్షి దారుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుమీదనే వాహనాలు నిలిపి ఉంచుతారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక్కడకు వచ్చే వారికి టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే కార్యాలయం ఆవరణ అంతా మునిగిపోతుంది. వర్షపు నీటిని ప్రత్యేకంగా మోటార్లు పెట్టి బైటకు తోడించాల్సి వస్తోంది.

భీమవరంలో ఇరుకు గదులు



భీమవరంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భీమవరంటౌన్ : భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే రిజిస్ట్రేషన్‌దారులు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. కూర్చునేందుకు షెడ్‌లు లేవు, కనీసం బెంచీలు ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. మంచినీటి సౌకర్యం లేదు. కార్యాలయంలోనూ సరైన వసతులు లేవు. ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (మిగతా 8వ పేజీలో)..

22 నుంచి పంట కాలువల మూసివేత

- చెరువుల్లో నీటిని నింపేందుకు పొడిగింపు

నరసాపురం/ధవళేశ్వరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పంట కాలువలు ఈనెల 22నుంచి మూసివేయనున్నారు. రబీ అనంతరం ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా పారేందుకు డెల్టా కాలవల షట్లర్లు, లాకులు వంటి మరమ్మతులు చేపట్టడానికి కాలువలకు నీటి విడుదల నిలిపివేస్తారు. డెల్టా కాలువలు ఈనెల 16నే మూసివేసేందుకు సిద్ధంకాగా గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి ఇతరత్రా అవసరాల కోసం ఈనెల 22 వరకు నీటి విడుదలకు గడువు పెంచారు. ఇరిగేషన్ మంత్రి ఆదేశాలతో కాలువల మూసివేతను 22 వరకు వాయిదా వేశారు. బుధవారం కాటన్ బ్యారేజ్ నుంచి తూర్పు డెల్టాకు 1200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1100 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది.

శిరగాలపల్లిలో ఆక్వా క్రాప్ హాలిడే

- చెరువు వద్ద ఇద్దరు రైతులు ఫ్లెక్సీ ఏర్పాటు



శిరగాలపల్లిలో చెరువు వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన రైతులు బాలాజీ, ప్రసాద్

యలమంచిలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం శిరగాలపల్లిలో ఆక్వారైతులు చిలుకూరి బాలాజీ, టి.నాగప్రసాద్ ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటించారు. జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అధ్యక్షతన ఇటీవల పాలకొల్లులో నిర్వహించిన ఆక్వారైతుల మహాసభలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలలపాటు ఆక్వా క్రాప్ హాలిడే ఇవ్వాలని రైతులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఒక అడుగు ముందుకువేసి బుధవారం నుంచి ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటించి మాట్లాడారు. ఫీడ్ ధరలు తగ్గించాలని, నాణ్యమైన సీడ్ సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వాచెరువుల వద్ద సర్వే నంబర్లు, విస్తీర్ణం వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. క్రాప్ హాలీడే ప్రకటన పాలకొల్లు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.



భీమవరంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆందోళన

సోనియా, రాహుల్‌పై కేసులు నిరసిస్తూ ధర్నా

భీమవరం అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని దర్యాప్తు సంస్థలను బీజేపీ ప్రతీకారాలకు వాడుకోవడం దారుణం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో బుధవారం భీమవరం ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అగ్రనాయకులైన సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ పెట్టిన అక్రమ కేసులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అద్దంకి దొరబాబు, నాయకులు ఎద్ల శివాజీ, కాకర రాజకుమార్, షుచ్చకాయల రత్నరాజు, కొర్రా శ్రీనివాస్‌యాదవ్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

తెల్లారిన కూలి బతుకులు

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన వ్యాన్

ఇద్దరు మహిళల దుర్మరణం

7



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

రైతు సేవా కేంద్రాలకే ధాన్యం విక్రయించండి : కలెక్టర్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'రైతు గుండె కోత' శీర్షికన వచ్చిన కథనానికి స్పందనగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. రైతులతో ఆమె స్వయంగా ముచ్చటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సకాలంలో సొమ్ములు పడుతున్నాయా? గోనె సంచుల సమస్య ఉందా అనే అంశాలను అడుగుతూనే దళారుల సమస్యపై చర్చించారు. ఎవరూ దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం సకాలంలోనే సొమ్ములు ఖాతాలోకి జమ చేస్తుందని అంతా ఆనందంగానే ఉంటుందని సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు పింక్ టాయిలెట్స్

- జిల్లాలో మొదటిగా భీమవరంలో ఏర్పాటు
- రెండు చోట్ల ఏర్పాటుకు మునిసిపాల్టీ కసరత్తు
- స్థలాలను పరిశీలించిన జేసీ, అధికారులు



మావుళ్లమ్మ ఆలయం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమవరంటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పలు పనుల నిమిత్తం మార్కెట్‌కు వచ్చే మహిళలకు అత్యవసరమైనవి తీర్చుకునేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ఘటనలు ఉన్నాయి. అటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా పింక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయబోతున్నారు. భీమవరంతోపాటు జిల్లాలోని అన్ని మునిసిపాల్టీలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. మహిళలు ఎక్కువగా వచ్చే ప్రాంతాలు, ఆలయాలు, మార్కెట్‌లు, బస్‌స్టాండ్‌ల ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ప్రత్యేకాధికారిణి స్త్రీశిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి వీటి నిర్మాణంపై దృష్టిపెట్టాలని సూచించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ముందుగా జిల్లా కేంద్రమైన భీమవరంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బుధవారం మునిసిపల్ స్పెషలాఫీసర్, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మునిసిపల్ టీపీవో పార్థసారథి, ఎంఈ త్రినాథరావు పలు ప్రాంతాలను పరిశీలించారు. త్వరలో స్థలాలను ఎంపికచేసి నిర్మించి అందుబాటులోకి తీసుకున్నారు.

సౌకర్యాలు, ఖర్చు ఇలా..

మహిళలకు ప్రత్యేకంగా ఉపయోగించుకునేలా నిర్మించనున్నారు. మూడు టాయిలెట్స్‌తోపాటు డ్రెసింగ్ రూమ్, చిన్నపిల్లలకు పాలు ఇచ్చేందుకు ఫీడింగ్ రూమ్, రెస్ట్ రూమ్ ఉంటాయి. వీటిని పరిశుభ్రంగా ఉంచేందుకు కేర్ టేకర్‌ను నియమించనున్నారు. టాయిలెట్స్ నిర్మాణానికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. స్థలం ఎంపిక చేసిన తరువాత అక్కడ ఏర్పాటు చేసే రూమ్‌లను బట్టి నిర్ణయం అవుతుందని చెబుతున్నారు. భీమవరంలో అధికారులు నాలుగు ప్రాంతాలను పరిశీలించారు. వీటిలో కలెక్టర్ నాగరాణి ఎంపిక చేసిన రెండు స్థలాల్లో టాయిలెట్స్ నిర్మిస్తారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

పాలకొల్లు పట్టణంలో మంచినీరు, డ్రెయిన్లు, పారిశుధ్యం, పార్కులు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలపై 17వ తేదీ గురువారం ఉదయం 9-10 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. పట్టణ ప్రజలు **92914 64646, 08814-222820** నెంబరుకు ఫోన్ చేసి మునిసిపల్ కమిషనర్ బందెల విజయసారథికు సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

ఆకివీడు, అత్తిలి ఏఎంసీ చైర్మన్‌లుగా వెంకట్రావు, ప్రసాద్



బి.వెంకట్రావు



డి.ప్రసాద్

ఆకివీడు/అత్తిలి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆకివీడుకు చెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు ఎంపికయ్యారు. 1982లో నందమూరి తారక రామారావు పార్టీ చేపట్టినప్పటి నుంచి టీడీపీలో పనిచేస్తున్నారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా, ఆకివీడు టీసీ సెల్ అధ్యక్షుడిగా రెండుసార్లు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2010లో టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమించబడి ప్రస్తుతం అదే పదవిలో కొనసాగుతున్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్‌గా దానం ప్రసాదు నియమించబడ్డారు. అత్తిలి మండల జనసేన అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



కలగా మోడి వంతెన

- ముఖ్యమంత్రి, మంత్రులు శంకుస్థాపన చేసినా దిక్కులేదు
- రోజురోజుకూ పెరుగుతున్న అంచనా వ్యయం
- సాకారం కాని తీర గ్రామాల ప్రజల కోరిక

మూడు దశాబ్దాలుగా తీర గ్రామాల ప్రజల ఎదురుచూపు

మొగల్తూరు మండలంలోని పలు తీర గ్రామాలను మొగల్తూరుతో కలుపుతూ దర్బరేవు డ్రెయిన్‌పై నిర్మించాల్సిన మోడి వంతెన నిర్మాణం తీర గ్రామాల ప్రజలకు కలగానే మిగిలింది. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నప్పటికీ ఇక్కడ వంతెన నిర్మాణానికి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, ఎన్నికల ముందు ఈ వంతెన శంకుస్థాపనలకే పరిమితమవుతోంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలోనూ ఈ వంతెన పనులు ఒక్క అడుగూ ముందుకు సాగలేదు. తీరం వెంబడి గల పేరుపాలెం నార్త్, సౌత్, కేపీపాలెం నార్త్, సౌత్, మోడి గ్రామాల ప్రజలతో పాటు జిల్లాలోని బీచ్ సందర్శకులు సుమారు ఎనిమిది కిలో మీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొగల్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):

తీర గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే కొబ్బరి, సరుగుడు, మత్స్య సంపద, ఉప్పు మరింత దూరం ప్రయాణించి జాతీయ రహదారికి చేర్చాల్సి వస్తోంది. సుమారు మూడు దశాబ్దాలుగా ఇక్కడ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రులు హామీ ఇచ్చినా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2009 జనవరి 31న శంకుస్థాపన చేసినా వంతెన పనులు జరగలేదు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు నాటి పంచాయతీరాజ్ శాఖ ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ నుంచి బ్యాంకు రుణంతో రూ.10 కోట్ల అంచనాలతో నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినా పనులు జరగక వంతెన కలగానే మిగిలింది. ఫలితంగా వంతెన నిర్మాణం జరగకపోగా ప్రతీ శంకుస్థాపనకు వంతెన నిర్మాణ అంచనా వ్యయం మాత్రం మూడింతలు పెరుగుతోంది.

- మొగల్తూరుతో పాటు తీర గ్రామాల ప్రజలు ప్రస్తుత జిల్లా కేంద్రం భీమవరం చేరుకునేందుకు ఈ వంతెనపై ప్రయాణం ఎంతో దూరం కలిసి వస్తోంది. పేరుపాలెం బీచ్ టూరిజంగా అభివృద్ధి చెందాలన్నా సందర్శకులు మొగల్తూరు జాతీయ రహదారి మీదుగా బీచ్‌కు వెళ్లేందుకు ఈ వంతెనపై ప్రయాణం (మిగతా 8వ పేజీలో)..

నిధులున్నా పట్టించుకోలేదు



మోడి వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి, టీడీపీ హయాంలో మంత్రి లోకేశ్ నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినా పనులు సాగలేదు. మొగల్తూరు, మోడి గ్రామాల రైతులు సాగు చేసుకోవడానికి వారి పొలాలకు వెళ్లాలంటే 8 కిలో మీటర్లు అదనంగా ప్రయాణించి ఇబ్బందులు పడుతున్నాం.

\- బస్వాని ఏడుకొండలు
మొగల్తూరు, లాకుపల్లవపాలెం.

పంచాయతీ ఎన్నికలు బహిష్కరించాం



మోడి వంతెన నిర్మాణం చేపట్టాలని తమ గ్రామస్థులు ఒక పర్యాయం పంచాయతీ ఎన్నికలు బహిష్కరించినా ఫలితం లేదు. ఈ వంతెన నిర్మాణం జరిగితే మోడి గ్రామానికే కాకుండా తీర గ్రామాలల్లో ఉత్పత్తులకు మంచి రవాణా జరిగి మహర్దశ పట్టనుంది. శంకుస్థాపనలకే పరిమితమైన ఈ వంతెన పనులు ఈ ప్రభుత్వంలో జరిగేలా దృష్టి సారించాలి.

\- మారెళ్ల మాధవి, సర్పంచ్, మోడి.

7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



- 11న తిరు కల్యాణ మహోత్సవం
- 12న రథోత్సవం
- 7 నుంచి 14 వరకు ఆర్జిత సేవలు రద్దు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమలలో వేంకటేశ్వర స్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 7నుంచి 14 వరకు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7న ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 12న రథోత్సవం, 13న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

స్వయం ఉపాధి రుణం మంజూరులో అన్యాయం

ఆకివీడులో దివ్యాంగుడి నిరసన



నిరసన తెలియజేస్తున్న లక్ష్మీ వరప్రసాద్

ఆకివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకంలో రుణ మంజూరులో అర్హులకు అన్యాయం జరిగిందని, అనర్హులకు రుణాలు మంజూరు చేశారని వర్తినేని లక్ష్మీ వర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుడైన తాను కాపు కార్పొరేషన్ రుణానికి దరఖాస్తు చేసుకున్నా ఎంపిక చేయలేదని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం మండుటెండలో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. తనకు రుణం పొందడానికి అన్ని అర్హతలున్నా తనను ఎంపిక చేయకపోగా వైసీపీకి చెందిన వారిని ఎంపికచేసి కూటమి ప్రభుత్వ పాలకులను అధికారులు అవమానించారన్నారు. సుమారు రెండు గంటలు మండుటెండలో ఉన్న ప్రసాద్ వద్దకు అధికారులు వెళ్లి న్యాయం చేస్తామని, ఈ విషయం ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో ప్రసాద్ ఆందోళన విరమించారు.

ఉల్లి కిలో రూ.10

కర్నూలు, మహారాష్ట్ర నుంచి దిగుమతుల జోరు
దిగొచ్చిన ధర



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న ఉల్లి దిగి వచ్చింది. నిన్నటి వరకూ రూ.30 వరకూ విక్రయించగా ఒక్కసారిగా ధరలు దిగి వచ్చి రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.10కే విక్రయిస్తున్నారు. ఎ గ్రేడు రకం రూ.12 పలుకుతోంది. దీంతో ఉల్లికొనుగోలు చేసేందుకు అన్ని వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు. ఉల్లి దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్‌కు మహారాష్ట ఉల్లి జోరుగా దిగుమతి అవుతోంది. ప్రస్తుతం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రోజుకు 15 లోడులు దిగుమతి అవుతున్నాయి. దీంతో పెద్ద వ్యాపారులు నిల్వ ఉండే ఉల్లిని కొనేందుకు ఆసక్తి చూపుతూ నిల్వ చేసేందుకు చూస్తున్నారు. ఉల్లి ధర వర్షాకాలం వచ్చేవరకూ నిలకడగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ధర ఎప్పుడు పెంచేస్తారో అని సామాన్యులు సైతం బస్తాలకు బస్తాల ఉల్లి కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి జిల్లా ఎంపీహెచ్ఏ (మేల్)

ఉద్యోగులకు పని సర్దుబాటు!

- మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో విధులు
- సీనియారిటీ ప్రాతిపదికన జాబితా
- ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల
- 260 మందికి డిప్యుటేషన్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో విధుల నిర్వర్తిస్తోన్న ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 260 మంది రెగ్యులర్, కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగుల సీనియార్టీ జాబితా రూపొందించి, వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పని సర్దుబాటు వారం రోజుల్లో పూర్తిచేయాలని డీఎంహెచ్‌వో, డీఎంవోలను ప్రభుత్వం ఆదేశించింది. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం 2022లో ప్రారంభంకాగా, ఈ కార్యక్రమం అమలుకోసం అప్పటి సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా ప్రతీ రెండు గ్రామ/వార్డు సచివాలయాలకు ఒక ఎంపీహెచ్ఏ(మేల్) చొప్పున నియమించారు. తాజా నిర్ణయం ప్రకారం వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా వారి సేవలను కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కార్యక్రమాలకు వినియోగించుకునేలా మార్గదర్శకాలను విడుదల చేశారు. ఆ ప్రకారం సీనియార్టీకి అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించి తొలి ప్రాధాన్యతగా మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో 2 నుంచి 4 సచివాలయాలకు కలిపి ఒక ఎంపీహెచ్ఏ, ఆ తర్వాత అధికంగా డెంగీ వ్యాధివ్యాప్తి చెందే పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఒకరు చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ కేసులు వ్యాప్తి చెందే ప్రాంతాల్లో 2-4 సచివాలయాలకు కలిపి ఒకరు చొప్పున ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఇంకా ఉద్యోగులు మిగిలిపోతే జాతీయ ఫైలేరియా కంట్రోల్ ప్రోగ్రాం సబ్ యూనిట్లు, జిల్లా మలేరియా యూనిట్‌లలో సర్దుబాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు డిప్యూటేషన్లపై సర్దుబాటు చేసినప్పటికీ, వారందరికీ జీతభత్యాలు మాత్రం ప్రధాన పని స్థానాల్లోనే చెల్లిస్తామని స్పష్టం చేశారు. కాగా ఉమ్మడి జిల్లా సీనియార్టీ జాబితా తయారీ, అభ్యంతరాలు, పరిష్కారం, కౌన్సెలింగ్ ద్వారా సర్దుబాటు ప్రక్రియ పూర్తి కావడానికి 15 రోజులు పడుతుందని భావిస్తున్నారు.

బాలిక మృతికి కారణమైన తండ్రికి జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తె తన వల్ల జన్మించలేదని భార్యను వేధించాడు, ఆపై కుమార్తెను హతమారుస్తానంటూ భార్యతో గొడవపడ్డాడు. ఆకస్మాత్తుగా ఐదేళ్ల బాలిక పొట్టపై బలంగా తన్నడంతో మృతి చెందింది. నేరం రుజువు కావడంతో ఆ తండ్రికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు కొత్తగూడెం సెంటర్‌కు చెందిన కాటుమాల రవితేజ (34)కు కనకదుర్గతో వివాహమైంది. వారికి కుమారుడు జశ్వంత్ (3), కుమార్తె రూఫీనా (5) ఉన్నారు. పెళ్లి అయిన నాటి నుంచి రవితేజ తాగుతూ కనకదుర్గను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అంతే కాకుండా కుమార్తె రూఫీనా తనకు జన్మించలేదని, ఆ బిడ్డను ఏనాటికైనా చంపుతానని గొడవ పడుతూ ఉండేవాడు. 2018లో గొడవపడడంతో ఏలూరు వన్ టౌన్ పోలీసులు కేసు కట్టారు. ఎప్పుడు గొడవ పడనని చెప్పడంతో లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 1న కనకదుర్గతో గొడవపడ్డాడు. ఆ సమయంలో కుమార్తె రూఫీనా తనకు జన్మించలేదని బాలిక పొట్టపై తన్నాడు. దీంతో రూఫీనా విలవిల్లాడుతూ స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే కనకదుర్గ, బాలిక అమ్మమ్మ కలిసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారు. ఈసంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎ నాగమురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జిల్లా కోర్టులో కేసు విచారణ సాగింది. రవితేజపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూటర్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామారావు వాదించగా అప్పటి సీఐ ఎ.నాగమురళి, వన్ టౌన్ సీఐ సత్య నారాయణ, ఎస్ఐ షేక్ బాషా, హెడ్ కానిస్టేబుల్ వైఎస్ మూర్తి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు, ఏఎస్ఐ సిసిలి సహకరించారు. వారందరిని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.

ఉద్యాన యూనివర్సిటీ ఉద్యోగులకు

జీతాలు లేవు!



డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో ఉద్యోగుల ఆకలి కేకలు అధికారులకు వినబడడం లేదు. అధ్యాపకులు, సీనియర్ ఉద్యోగులు సైతం వాయిదాల పద్ధతిలో జీతాలు అందుకుంటున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి మరింత దయనీయం. నెలల తరబడి వేతనాలు అందక పూట గడవని స్థితిలో ఉన్నారు. ఉద్యోగులతో పాటు శాస్త్రవేత్తలకు వేతనాలు, పరిశోధనా విద్యార్థులకు (పీహెచ్‌డీ) స్టైఫండ్ అందడం లేదు.

- అధ్యాపకులకు వాయిదా చెల్లింపులు
- ఉద్యోగులకు పెండింగ్
- ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి దయనీయం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యం, సిబ్బంది అలసత్వంతో ఉద్యోగులు ఇబ్బంది పడగా పరిశోధనా విభాగం కుంటుపడింది. కూటమి ప్రభుత్వం రాగానే అడ్డదారిలో ఉప కులపతిగా నియమితులైన జానకిరామ్‌ను విధుల నుంచి తొలగించారు. సీనియారిటీ ప్రాతిపదికన ఇన్‌చార్జ్ ఉప కులపతిని నియమించారు. విశ్వ విద్యాలయ సిబ్బంది అలసత్వంతో నేటికి గాడిన పడకపోగా చివరికి రెగ్యులర్ ఉద్యోగులకు (శాస్త్ర వేత్తలు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అసిస్టెంట్) జీతాలు అందించలేని దుస్థితికి చేరింది.

ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా..

ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినా సకాలంలో ట్రెజరీకి జీతాల బిల్లులు పంపకపోవడంతో ఏప్రిల్‌లో రెగ్యులర్ ఉద్యోగులు వాయిదా చెల్లింపులతో చెల్లింపులతో సరిపెట్టుకున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి మరి దయనీయంగా మారింది. సుమారు నాలుగు నెలల నుంచి వారి వేతనాలపై లెక్కపత్రం లేకుండా పోయింది. ముఖ్యంగా సెక్యూరిటీ నుంచి అటెండర్ పోస్టుల వరకూ అందరూ సుమారు 400 మందికి 3 నెలల జీతాలు అందక ఇంటి అవసరాలకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా వర్సిటీ ఉద్యోగుల పరిస్థితి ఉందని సిబ్బంది పెదవి విరుస్తున్నారు.

పీహెచ్‌డీలకు బకాయి

యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న వారి స్టైఫండ్ బకాయిలు పేరుకుపోయాయి. పీహెచ్‌డీలకు ప్రతీ నెలా చెల్లింపులు లేవు. కొందరు విద్యా సంబంధిత అవసరాలు, వారి ఖర్చులకు స్టైఫండ్ ఆధారం. వారి ఎరియర్స్ చెల్లింపుల మాటే వినిపించడం లేదు.

ఒక నెల ఇస్తే.. మరో నెల ఇవ్వరు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో అయోమయం నెలకొంది. గత సంవత్సరం డిసెంబర్ వరకూ జీతాలు అందుకున్నారు. తరువాత జనవరి జీతం లేకపోవడంతో బడ్జెట్ ఇబ్బంది వస్తుందిలే అని సరిపెట్టుకున్నారు. తర్వాత ఫిబ్రవరి జీతాలు అందాయి. మళ్లీ మార్చి వేతనాలు లేవు. సిబ్బంది జీతాల చెల్లింపు విభాగంలో క్రమపద్ధతి లేకుండా వ్యవహరిస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాంక్షన్, నాన్ శాంక్షన్ మెలిక

గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, సిబ్బందిని ఇష్టానుసారం నియమించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై యూనివర్సిటీ ముఖ్య అధికారులు ప్రభుత్వానికి సరైన వివరాలు అందించారో లేదో కానీ ఆ ఇబ్బంది వల్ల శాంక్షన్ పోస్టులకే బడ్జెట్ విడుదల చేస్తామని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీనితో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం ఇంకెన్ని నెలలు ఎదురుచూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

నాచుగుంట స్థూపం వద్ద సర్వమత ప్రార్థనలు
స్త్రీ శక్తి పురస్కారం పంపిణీ



స్త్రీ శక్తి పురస్కారం అందుకోనున్న రామలక్ష్మి

ఉంగుటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సర్వోదయ మండలి 65వ ఆవిర్భావ దినోత్సవం నాచుగుంట వద్ద ఈ నెల 18న జరుగుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. అఖిల భారత సర్వోదయ సమ్మేళనం గుర్తుగా నాచుగుంట వద్ద స్థూపాన్ని ఏర్పాటు చేశారన్నారు. సర్వమత ప్రార్థనలతో పాటు స్త్రీ శక్తి పురస్కారానికి బోయపాటి రామలక్ష్మికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ప్రసాదరాజు వివరించారు.



డీజీపీ హరీష్ కుమార్ గుప్త నుంచి పురస్కారం అందుకుంటున్న పశ్చిమ పోలీసు అధికారులు

నేర పరిశోధనలో పశ్చిమ పోలీసులు ప్రథమం

ఎస్పీ, సిబ్బందికి ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు

భీమవరం క్రైం/ఆచంట/ఉండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి నేతృత్వంలో జిల్లా పోలీసులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉండి మండలం యండగండిలో పార్శిల్ పేరిట మృతదేహం బట్వాడా కేసును స్వల్ప కాలంలో ఛేదించడం ఉన్నతాధికారులు అభినందించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్త నుంచి ప్రతిష్టాత్మక ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) అవార్డును జిల్లా పోలీసు అధికారులు అందుకున్నారు. ఏఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ రావూరి గణేశ్ జయసూర్య, ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు, భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఉండి ఎస్ఐ ఎండీ. నజీరుల్లా, కాళ్ల ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు, ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ, భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ అవార్డులు అందుకున్నారు. నేర పరిశోధన, నేరస్తులను గుర్తించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆచంట ఎస్ఐ వెంకట రమణ డీజీపీ నుంచి అవార్డు అందుకోవడంపై పలువురు అభినందించారు.

ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన ముదునూరి రంగరాజు కుమార్తెలు సాగి తులసికి మృతదేహాన్ని పార్శిల్‌గా పంపించిన కేసును ఛేదించడం ద్వారా పోలీసు శాఖ గౌరవం ఇనుమడించిందని ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఈ కేసులో నేరస్థుడు చిన్న అల్లుడు సుధీర్‌వర్మను సిబ్బంది సహకారంతో స్వల్ప కాలంలో పట్టుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

తెల్లారిన కూలి బతుకులు

ఇద్దరు మహిళల దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మొగల్తూరులో విషాదం
- పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహాయక చర్యలు
- సంఘటనా స్థలిని పరిశీలించిన కలెక్టర్, డీఎస్పీ, ఎమ్మెల్యే

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన వ్యాన్



కదలి పావని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గుబ్బల గంగాదేవి మృతదేహం

మొగల్తూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితేకాని డొక్కాడని వారికి కూలి పనులే ఆధారం. ఉన్న ఊరిలోనే ఏదొక పని చేసుకుని బతుకు వెళ్లదీస్తారు. ఎప్పటిలాగే ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లిన వారి బతుకులే తెల్లారిపోయాయి. పనులు చేస్తుండగా వ్యాన్ రూపంలో మృత్యువు కబళించింది. ఏమి జరిగిందో తెలిసేలోపు ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

మొగల్తూరు పంచాయతీ పరిధి నల్లంవారి తోట దొడ్డితిప్ప ప్రాంతంలో బుధవారం ఉదయమే జరిగిన సంఘటనతో విషాదం అలుముకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెంకు చెందిన 15 మంది కూలీలకు ఉపాధి పనుల్లో భాగంగా నల్లంవారితోటలో సుమారు కిలోమీటరు పొడవు గల 46 డీపీ చానల్ పంట బోదె తవ్వకం పని అప్పగించారు. 216 జాతీయ రహదారి వెంబడి ఉన్న పంట బోదెలో కూలీలు పనులు చేస్తుండగా పల్నాడు జిల్లా నరసారావుపేట నుంచి మొగల్తూరుకు వంటనూనె లోడుతో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న సైకిల్, ఉపాధి కూలీల మీదుగా పంటబోదెలోకి దూసుకుపోయింది. బోదెలో పని చేస్తున్న కదలి పావని (40), గుబ్బల గంగాదేవి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు కూలీలు గుడాల వీర వెంకట సత్యనారాయణ, మృతురాలు గుబ్బల గంగాదేవి భర్త మాణిక్యాలరావుకు తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో సమీపంలో కూలీలంతా ప్రమాదం జరిగిన పంటబోదె వద్దకు పరుగులు తీశారు. గాయపడ్డ మహిళలను బోదెలోంచి బయటకు తీసుకువచ్చారు. వారిద్దరూ అప్పటికే విగతజీవులయ్యారు. మరో ఇద్దరు గాయాలతో ఆర్తనాదాలు చేస్తుండడంతో వెంటనే పోలీస్, 108కు సమాచారం అందించారు. గాయపడిన ఇద్దరిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధికారుల సహాయక చర్యలు

బోదెలో పడ్డ వ్యాన్ కింద మరికొంత మంది కార్మికులు ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు హైడ్రాలిక్ యంత్రాన్ని రప్పించి వ్యాన్‌ను బయటకు తీశారు. సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ నాగరాణి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, రూరల్ సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, నాగలక్ష్మి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ కె.రాజ్ కిశోర్, ఎంపీడీవో సీహెచ్ త్రికాలపాణి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వంట నూనె ప్యాకెట్లు, నూనె డబ్బాల లోడును పోలీస్ సిబ్బంది స్వయంగా ఖాళీ చేయడంతో హైడ్రాలిక్ యంత్రంతో వ్యాన్ గట్టుకు రప్పించారు. మొగల్తూరు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున సంఘటనా ప్రదేశానికి తరలివచ్చారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది.

శుభకార్యానికి వెళ్లి..

ఉదయాన్నే పనికి వెళ్లడానికి తెల్లవారు జామునే లేచి ఇంటి పనులు ముగించుకున్నారు. గంగాదేవి, భర్త మాణిక్యాలరావు పనికి వెళుతూ గ్రామంలో ఒక శుభకార్యక్రమానికి వెళ్లి అక్షింతలు వేశారు. దంపతులు ఇద్దరూ కలిసి ఆశీర్వదించిన చివరి ఘట్టం అదే. కదలి పావని అదే శుభకార్యానికి వెళ్లి అక్కడి నుంచి పనికి వెళ్లిన అరగంటలోనే మృ త్యువాత పడింది.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కలెక్టర్ నాగరాణి, విప్ నాయకర్

ప్రమాదస్థలిని కలెక్టర్ నాగరాణి, ప్రభుత్వ విప్ నాయకర్ పరిశీలించారు. నరసాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. గుబ్బల మాణిక్యాలరావును మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలైన గుడాల సత్యనారాయణకు స్కానింగ్ తీయించి నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేయిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. కలెక్టర్, విప్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరు మహిళా కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున గాయపడ్డ కూలీలకు ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున నష్టపరిహారం అందజేస్తామని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. చంద్రన్న బీమా పథకం నుంచి మృతుల కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు చొప్పున నష్టపరిహారం అందించే అవకాశం ఉందని ఆయన వివరించారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త పట్టిసీమలో మద్యం లోడు వాహనం బోల్తా



మద్యం లోడుతో బోల్తాపడిన వాహనం

పోలవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త పట్టిసీమ వద్ద బుదవారం మద్యం లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ బోల్తాపడింది. కొవ్వూరు వైపు నుంచి పోలవరం మద్యం లోడుతో వస్తున్న వాహనం పట్టిసీమ ఇసుక ర్యాంపు సమీపంలో మలుపు వద్ద బోల్తాపడడంతో మద్యం సీసాల బాక్సులు నేలపాలయ్యాయి. కొన్ని మద్యం సీసాలు, బీరు కేసులు పగిలిపోయాయి. మద్యం షాపు నిర్వహకులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన సీసాలను మరో వాహనంలో తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, రూ.7 లక్షల విలువైన మద్యం లోడులో 30శాతం నష్టపోయినట్టు షాపు నిర్వాహకులు తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే మలుపు వద్ద కారు బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ప్రమాదాలు జరిగే ప్రాంతమని పోలీసులు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్ల డ్రమ్ములు ఏర్పాటు చేశారు. అవి పోవడంతో మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయి.

కల్తీ బెల్లం తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కల్తీ బెల్లం తయారీపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అధికారి వి శ్రీరాం బాబుకు సమాచారం అందింది. యలమంచిలి మండలం కంచుసంభంపాలెంలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో బుధవారం విజిలెన్స్ ఎస్ఐలు కె.సీతారామ్, కె.నాగరాజు, ఆహార తనిఖీ అధికారి సుందరరామిరెడ్డి, సిబ్బంది తనిఖీ చేపట్టారు. కృత్రిమ రంగులు, రసాయనాలు కలిపినట్లు నిర్ధారణ కావడంతో ల్యాబ్ పరీక్షల నిమిత్తం వాటిని సీజ్ చేశారు. అపరిశుభ్రత వాతావరణంలో బెల్లం తయారీ చేస్తున్నందున ఆహార భద్రత చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. రంగులు, రసాయనాలు కలుపుతుండడంతో వారిపై యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అక్కడ ఉన్న కల్తీ బెల్లాన్ని సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి

పెనుగొండ, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): వడలి - పిట్టలవేమవరం రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పెనుగొండకు చెందిన స్వీటు వ్యాపారి కొడుకు తడివాడ భార్గవ్ స్నేహితుడు నంద కిశోర్ ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను రాసుకుంటూ వెళ్లడంతో రోడ్డు పక్కన కొబ్బరి చెట్టును ఢీకొన్నారు. భార్గవ్ తలకు బలమైన గాయంతో మృతి చెందాడు. గాయపడిన నంద కిశోర్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కె.గంగాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి జారిపడి..

భీమవరం క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భవనానికి రంగు వేస్తున్న వ్యక్తి జారిపడి మృతి చెందాడు. గాంధీనగర్‌కు చెందిన కురెళ్ల తాతారావు (56) బుధవారం మారుతీ నగర్‌లో ఇళ్ల వేణుగోపాల్ ఇంటికి రంగు వేసే పనికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని అల్లుడు జవ్వాది సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన తలపాల ప్రశాంత్ (27) అప్పులుచేసి ఇల్లు కట్టాడు. అతని తల్లికి క్యాన్సర్ సోకడంతో వైద్యం నిమిత్తం మరింత అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం కానరాక ఈ నెల 15న రాత్రి పురుగుమందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మరణించారు. వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమా చారం ఇచ్చారు.

తల్లిదండ్రులు విడిగా ఉంటున్నారని

కుమార్తె ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటున్నారని కుమార్తె అల్లు అలేఖ్య (16) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై జబీర్ తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన అల్లు రవి, నాగదుర్గాదేవి దంపతులు కొంతకాలంగా మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. కుమార్తె అలేఖ్య జంగారెడ్డిగూడెంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. తాను మృతి చెందిన తరువాతైనా అమ్మానాన్న కలిసి ఉండాలని లేఖ రాసినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దామరచర్ల ఘటనలో పది మంది కోర్టుకు

కుక్కునూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దామరచర్లలో రెండు సామాజిక వర్గాల మధ్య కొట్లాట కేసులో బుధవారం 10 మందిని కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనలో 28మందిపై కేసులు నమోదయ్యాయి. గ్రామంలో గొడవలు జరగకుండా సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

చదరంగంలో ఉచిత శిక్షణ ప్రారంభం

కాళ్ళ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీసలి జడ్పీ హైస్కూల్‌లో చదరంగంపై ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు మాట్లాడుతూ విద్యతోపాటు మేధస్సును అందించే చదరంగం క్రీడను ప్రోత్సహిస్తూ నియోజకవర్గంలోని పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చేస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు.

25 నుంచి నాటిక పోటీలు

యలమంచిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొంతేరులో యూత్‌క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో 43వ అఖిల భారతస్థాయి నాటిక పోటీలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి మురళీకృష్ణ, గంటా ముత్యాలరావు తెలిపారు. కొంతేరు యూత్ క్లబ్ నాటక పరిషత్ కార్యాలయంలో పరిషత్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన కార్యవర్గ సమావేశంలో బ్రోచర్లను ఆవిష్కరించారు.

నేడు మార్కెట్ పాట కౌన్సిల్ ఆమోదించేనా..?

నరసాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ పాటపై ఇంకా సస్పెన్స్ వీడలేదు. ఆరోసారి నిర్వహించిన పాటలో భూపతి సురేష్ రూ. 45 లక్షలకు పాట పాడుకున్నాడు. ఇది ప్రారంభ ధర కంటే రూ. 27 లక్షలు తక్కువ. ఈ పాటను కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. దీని కోసం గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్ ఆమోదిస్తేనే పాట ఓకే అవుతుంది. లేని పక్షంలో మళ్లీ పాటను నిర్వహించాల్సి ఉంటుంది. కౌన్సిల్ పాటను ఆమోదించకుండా ప్రభుత్వ నిర్ణయానికి పంపే ఛాన్స్ కూడా ఉంది. ఇదే జరిగితే మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంట్ర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుమంట్ర మండలం మల్లిపూడి-2 కేంద్రానికి అంగన్వాడీ టీచర్ పోస్టు ఓపెన్ కేటగిరి మహిళకు రిజర్వ్ చేయడంతో ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి అంగర కృష్ణకుమారి తెలిపారు. స్థానికురాలైన వివాహిత, వయస్సు 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండి 10 తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆయా పోస్టులకు పెనుమంట్ర-7వ కేంద్రం బీసీ(డి), వీవీ పాలెం-2 ఎస్సీ, వెలగలేరు-2 ఓపెన్ కేటగిరి, పెనుగొండలో 13వ కేంద్రం బీసీ(బి) మల్లప దిబ్బ ఎస్సీకి, సిద్ధాంతం-6 కేంద్రం ఎస్సీకి, పద్మనాభని చెరువు బీసీ(డి), నీరుల్లిపాలెం ఎస్సీ, అయోధ్య లంకలోని మర్రిమూల బీసీ(ఏ) మహిళలకు రిజర్వాయరు చేశారని తెలిపారు. ఆసక్తిగల మహిళలు నేరుగాగాని, పోస్టులోగానీ పోస్టుద్వారా గానీ ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అందేలా దరఖాస్తులు అందించాలని సూచించారు.

సీనియర్ సిటిజన్స్ డిజిటల్ కార్డులు పొందాలి

తణుకు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందించే సీనియర్ సిటిజన్స్ డిజిటల్ కార్డు పొందాలని సంఘ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. బుధవారం సంఘ కార్యాలయంలో డిజిటల్ కార్డు పొందడంపై అవగాహన సదస్సు నిర్వహించి ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు గ్రామ, వార్డు సచివాలయాలు వద్ద రూ. 40 చెల్లించి కార్డు పొందాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టి వెంకయ్య, అల్లూరి కరుణాకర్ చౌదరి, అలివేలు మంగ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం నిర్వహణకు విరాళం

తణుకు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేల్పూరు రోడ్డులో మానవత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి పట్టణానికి చెందిన గోకవరపు కాశీ విశ్వేశ్వరరావు రూ.10 వేలు విరాళం అందజేయగా బుధవారం చలివేంద్రం వద్ద ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ డా.కోడూరి రాధాపుష్పావతి మాట్లాడుతూ ఈ నెల 7న చిట్టూరి అచ్యుతరామ ప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన సతీమణి సుజాత అందించిన విరాళంతో చలివేంద్రాన్ని ప్రారంభించామని, 30 రోజులు పాటు చలివేంద్రం నిర్వహణకు దాతలు సహకారం అవసరమన్నారు. మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం పైడిపర్రులోని కూటమి నాయకులు జ్యోతికృష్ణ ఏర్పాటు చేసిన చలివేంద్రను ఆయన ప్రారంభించారు.

చరిత్ర సృష్టించిన కందుకూరి

భీమవరం టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రచయితగా సంఘ సంస్కర్తగా కందుకూరి చరిత్రలో నిలిచిపోయారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, ఉగాది పురస్కార గ్రహీత తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి, తెలుగు పండితులు కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు పండితులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులకు కందుకూరి జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. పలువురు తెలుగు పండితులను సత్కరించారు. జిల్లా పెన్షనర్ల సంఘం కార్యదర్శి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి

పాలకోడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం పంచాయతీ పరిధిలో గల బంటుమిల్లిలో బుధవారం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ శాసనమండలిలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటానికి అవసరమైన పోరాటం చేస్తున్నానని, దీనికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు. సభకు మండల విద్యాశాఖాధికారి పీవీ శివనాగరాజు అధ్యక్షత వహించగా హెచ్ఎం జీవీవీ రామానుజరావు, శృంగవృక్షం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కాశీ జగన్నాథం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, సర్పంచ్ సూరిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ పి.లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక జర్నలిస్ట్ కడలి సాయిబాబాని, ఎమ్మెల్సీ గోపీమూర్తిని సన్మానించారు.

పూలపల్లిలో ఉపాధి పనులు పునః ప్రారంభం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పూలపల్లి గ్రామాభివృద్ధికి ఉపాధి పనులు దోహదం చేస్తాయని పాలకొల్లు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. పూలపల్లి పాలకొల్లు పట్టణంలోకి విలీనం కావడంతో గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిలిపివేసింది. దీంతో గ్రామంలోని కూలీలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతుండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పథకాన్ని పూలపల్లి గ్రామానికి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో బుధవారం అధికారులు పంచాయితీ వద్ద గ్రామసభ నిర్వహించి పనులు గుర్తించి, కూలీలకు జాబ్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ సభలో కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ కూలీలకు ఉపాధి కల్పించినప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీడీవో ఎన్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని 201 మంది కూలీలకు జాబ్ కార్డులు మంజూరు చేశామని వీరంతా ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మద్దాల వాసు తదితరులు

బాధితుడికి మానవత చేయూత

పాలకొల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లవానిపాలెం గ్రామానికి చెందిన సిద్దుల గాంధీ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండడంతో మానవత పాలకొల్లు మండల శాఖ అధ్యక్షుడు మద్దాల వాసు, సభ్యులు స్పందించి బుధవారం గాంధీకి రూ.10,116లు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఉన్నంతలో ఇతరులకు సహాయ పడగలగటం దేవుడిచ్చిన వరమన్నారు. దీనికి సహకరించిన మాజీ ఎంపీ జోగయ్య, పెన్మెత్స సత్యసాయిబాబా, బోళ్ల శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మానవత కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్, శ్రీవాత్సవ ప్రదీప్, గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి : కాకర్ల

తణుకు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకర్ల వేణుబాబు అన్నారు. మంగళవారం రాత్రి తణుకు లయన్స్ క్లబ్‌కు అధికారిక పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనను అధ్యక్షుడు సప్పా బలరామ్, పలువురు లయన్స్ ప్రతినిధులు సన్మానించారు. క్లబ్ చేసిన సేవా కార్యక్రమాలను కార్యదర్శి ఎం. రవిరేజినాల్డ్ వివరించారు. లయన్స్ ప్రతినిధులు యాతం నాగరాజకుమార్, చీకటి శ్రీనివాసరావు, కడియాల సూర్యనారాయణ, వావిలాల సరళాదేవి, డి.రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థుల శాతం పెంచండి



మాట్లాడుతున్న ఎంపీపీ హరినారాయణరాజు

ఉండి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శాతం పెంపునకు విద్యాశాఖ, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఫీల్డ్ వర్కుచేసి విద్యార్థుల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల భవనాలు ఉన్నాయని, ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. దీనిపై ఎంఈవో వినాయకుడు మాట్లాడుతూ ఇప్పటికే తాము ఫీల్డ్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. మండలంలో 8 పాఠశాలలు మోడల్ పాఠశాలలుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా మంచినీటి చెరువులను నింపుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ మినుము, పెసలు 50 శాతం సబ్సిడీపై అందిస్తోందని రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వైస్ ఎంపీపీ సుజాతారాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశాలు

అధికారుల డుమ్మాపై ఆగ్రహం



విద్యుత్ సిబ్బందిని నిలదీస్తున్న సర్పంచ్ వెంకట రామరాజు

ఆకివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారంటూ ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి ముఖ్యశాఖల అధికారులు రారు.. తమ సిబ్బందిని పంపిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారుల పేర్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఎంపీపీ కరారి జయలక్ష్మి, ఎంపీడీవో డి.సుహాసిని తెలిపారు. వేసవిలో తాగు, సాగు నీరు, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో పైన పేర్కొన్న సమస్యలతో పాటు ఆక్వా తదితర సమస్యలు అధికంగా ఉన్నా సంబంధిత అధికారులు సమావేశాలకు కూడా హాజరుకావడం లేదంటూ ప్రజా ప్రతినిధులు ఆగ్రహించారు. వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఏవో శ్రీకర్, ఆర్ఐ అంజనేయులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఆరిమిల్లి

తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

తణుకు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌తో కలసి పట్టణంలోని 11, 12 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీ అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాకారులు సమస్యలు పరిష్కారానికి కృషి కళాకారులకు 50 ఏళ్లకే పెంచన్ అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు. బుధవారం తెలుగు నాటక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వావిలాల సరళాదేవి, బసవా రామకృష్ణ, మోపిదేవి శంకరావు, సిద్దా రామకృష్ణ, దంపూరి దుర్గాప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



కిక్కిస తొలగింపు పనులు చూస్తున్న రఘురామ

పనులు నాణ్యతగా ఉండాలి

కాళ్ళ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీసలి గ్రామ పరిధిలో మొగదిండి మేజర్ మురుగు డ్రెయిన్‌లో తీవ్రంగా అల్లుకుపోయిన కిక్కిస, తూడు తొలగింపు పనులను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు బుధవారం పరిశీలించారు. సుమారు రూ. 30 లక్షలతో 7.2 కి.మీ. మేర చేపట్టిన పనులు పూర్తి నాణ్యతతో ఉండాలని సూచించారు. ఉండి డీసీ చైర్మన్ పణిబాబు తదితరులు పాల్గొన్నారు.



నాయకర్ ఆర్థిక సాయం

మొగల్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలి పనులకు వెళ్ళి వ్యాన్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వారి కుటుంబీకులను, క్షతగాత్రులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్ పరామర్శించారు. తీవ్రంగా గాయపడి భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుబ్బల మాణిక్యాలరావును పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

సాయం అందించిన కొత్తపల్లి

మాజీ మంత్రి రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. మృతి చెందిన గుబ్బల గంగాదేవి, కడలి పావని కుటుంబ సభ్యులకు రూ.10వేలు చొప్పున, గాయపడ్డ గుబ్బల మాణిక్యాలరావు, గుడాల వీర వెంకట సత్యనారాయణలకు వైద్య సహాయం నిమిత్తం రూ.5వేలు చొప్పున జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరపున అందించినట్టు తెలిపారు. ఆయన వెంట దొంగ స్వామి, ముక్కు ఫుల్లయ్య నాయుడు, దేశంశెట్టి శ్రీను మెండి రాజేష్ తదితరులున్నారు.

కందుకూరికి ఘన నివాళి

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నవ సమాజ నిర్మాణ సారథి కందుకూరి వీరేశలింగం పంతులు అని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) తెలుగు హెడ్ డాక్టర్ బూసి వెంకట స్వామి అన్నారు. కళాశాలలో బుధవారం వీరేశ లింగం జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. వీరేశలింగం సేవలను వివరించారు.

భూసారం కోసం పచ్చిరొట్ట

అత్తిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రసాయనాల వాడకంతో భూసారం తగ్గుతుందని, జనుము, జీలుగు, పిల్లిపెసర, అలసంద వంటి పంటలను దాళ్వా పంట తరువాత పూత వరకు పెంచి ఆ తర్వాత నేలలో కలిపి దున్ని పచ్చిరొట్ట ఎరువులు తయారు చేసుకోవాలని అత్తిలి పచ్చిరొట్ట వ్యవసాయాధికారి టీకే రాజేష్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుగానే కాక పశువు లకు మేతకుగాను ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సామూహిక సీమంతాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే



అలంపురంలో పరికరాలిస్తున్న బొలిశెట్టి

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

భీమవరంటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన బిడ్డల కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని, క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా వైద్యాధికారులు సిబ్బంది వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించి, పండ్ల కిట్‌ను అందజేసి ఆశీర్వదించారు.

యంత్రాలు ప్రారంభించిన కలెక్టర్

తాడేపల్లిగూడెం రూరల్: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించే లక్ష్యంతో కచ్చితమైన ప్రయోగ ఫలితాలు అందించాలని కలెక్టర్ సూచించారు. తాడేపల్లిగూడెంలోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రయోగశాలలో యంత్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ఈ యంత్రాలు ఎరువులు, పురుగు మందుల్లో సూక్ష్మ, స్థూల పోషకాలను పరీక్షిం చేందుకు ఉపయోగపడతాయని, ఈ ప్రయోగ శాలలో ఏడాదికి 3 వేల ఎరువులు, 2 వేల పురుగు మందుల శాంపిల్స్‌ని తనిఖీ చేసి నివేదికను అందించే వీలుంటుందన్నారు. అలాగే విత్తనాలు, భూసార పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ఉండాలి: బొలిశెట్టి

ఆరోగ్యవంతమైన భావితరాల కోసం పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ పీవో టీఎల్ సరస్వతి, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయకులు పాల్గొన్నారు.

కారుమూరి నోరు అదుపులో పెట్టుకోవాలి..

పెంటపాడు: వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బొలిశెట్టి అన్నారు. బుధవారం అలంపురంలో నియోజకవర్గ స్థాయిలో రైతులకు రూ. 38.01 లక్షల విలువ కల్గిన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై రైతులకు అందజేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాతపూడి ప్రగతి, ఏవో పార్థసారధి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుంటే వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి కారుమూరి తన నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, టీబీఆర్ సంస్థ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు, పుల్లా బాబి, ఏడిఏ మురళీకృష్ణ, టీడీపీ నాయకులు సుంకవల్లి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

పెనుగొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పెనుగొండలో వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. అమరావతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేషీలో పెనుగొండ నుంచి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఈవోపీఆర్డీ కిషోర్‌బాబు, పెనుగొండ పంచాయతీ సెక్రటరీ రత్నాకరరావు, ఈవో భీమేశ్వరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తదితర అధికారులతో అమరావతిలో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులకు దశలవారీగా నిధులు మంజూరుకు పవన్ కల్యాణ్ సిద్ధంగా ఉన్నారని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాల బ్రిడ్జి నిమిత్తం రూ. 12 కోట్లు ఖర్చు అవుతుందని నిర్ణయించగా మరలా పరిశీలించి పంపించాలన్నారు. డ్రెయినేజీ నిమిత్తం నిధులు మంజూరుకు అధికారులు పరిశీలించి నివేదిక పంపించాలన్నారు. స్కూళ్లకు సంబంధించి పనులేమైనా పెండింగ్‌లో ఉంటే అవి వెంటనే ప్రారంభించాలని తెలిపినట్లు వివరించారు.



హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి)- మండలంలోని వైఎస్‌పాలెం గ్రామంలో బుధవారం 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గుబ్బల సత్యనారాయణ కుమారులు, గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, వీసీ కొత్తపల్లి నాని, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబు, సర్పంచ్ వైఎస్ ముత్యమాంబ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమాన హక్కుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

ఆకివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెం దుతున్నప్పటికీ సమాన హక్కులు కల్పించడంతో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ్ కుమారి ఆరోపించారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు వార్డులలో సామాజిక చైతన్యయాత్ర పేరుతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు నేటికి కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి: బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన మత్స్యశాఖ సొసైటీ కార్యవర్గ సభ్యులు సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పెంటపాడు మత్స్యశాఖ సొసైటీ నూతన అధ్యక్షుడు తిరుమలశెట్టి రమణ, ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి వీరబాబు తదితరులు బుధవారం బాబ్జిని మర్యాదపూర్వకంగా కలవగా బాబ్జి రమణను సత్కరించారు.

కలగా మోడి వంతెన

(5వ పేజీ తరువాయి)

ఎంతో అవశ్యకమైంది.

వంతెన శంకుస్థాపనల చరిత్ర ఇలా..

జడ్పీ చైర్మన్‌గా దివంగత మాగంటి రవీంద్రనాథ్ చౌదరి ఒకసారి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకసారి ఈ వంతెన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. గత టీడీపీ హయాంలో నాటి ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పంచాయతీరాజ్ ప్రాజెక్టు డిపార్ట్‌మెంట్ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయడంతో నాటి మంత్రి నారా లోకేశ్ మోడి గ్రామానికి వచ్చి శంకుస్థాపన చేశారు. పనులకు టెండర్‌లు పిలిచే సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ నిలిచింది. జాప్యం కావడంతో అంచనాల వ్యయం పెరగడంతో మరో ఐదు కోట్లు రూపాయలు పెంచుతూ కొత్త అంచనాలు రూపిందించి పంపారు. పెరిగిన అంచనాలకు బ్యాంకు నుంచి ఆమోదం రాకపోవడంతో టెండర్‌కు నోచుకోలేదు. ఈ వంతెన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. ముఖ్యమంత్రులు, మంత్రులు ఈ వంతెనకు శంకుస్థాపనలు చేస్తున్నా వంతెన కల సాకారం కాకపోవడంతో నిరాశగా తీర గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అన్నీ పాత భవనాలే..

(5వ పేజీ తరువాయి)

పాడుబడ్డ భవనాన్ని తలపిస్తోంది. సిబ్బంది కొరత వెంటాడుతోంది.

20 ఏళ్లు పైబడి అద్దె భవనంలోనే..

ఆకివీడు: ఆకివీడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఇరవై ఏళ్ల పైబడి అద్దె భవనంలోనే కొనసాగుతుంది. అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారికి అనుకుని ఉంది. పార్కింగ్ కోసం రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారంతా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు పెట్టుకునే స్థలం లేదు. రిజిస్ట్రేషన్ సమయంలో కనీసం డాక్యుమెంట్‌లను రాసుకునే సౌకర్యాలు కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేవు. నూతన కార్యాలయం కోసం స్థలం



జాతీయ రహదారికి అనుకొని అద్దె భవనంలో నిర్వహిస్తున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం

ఇస్తామంటూ ఓ దాత ముందుకొచ్చారు. ఈ విషయాన్ని సిబ్బంది ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం నిధులు కేటాయించేందుకు ముందుకొస్తేనే ఆకివీడులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం కల సాకారమవుతుంది.

అలరించిన తితిక్ష, అనస్వరం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కళారంజని 14వ వార్షికోత్సవ జాతీయ స్థాయి తెలుగు నాటికల పోటీలు బుధవారం రాత్రి భీమవరంలోని సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చుక్కన్నశ్రీ స్మారక పురస్కారంను వేల్పుల నాగేశ్వర రావుకు, జవ్వాది సూర్యారావు స్మారక పురస్కారం విశాఖ పట్నం చెందిన చలసాని కృష్ణ ప్రసాద్‌కి అందజేసి సత్కరించారు. బీవీకే క్రియేషన్స్ కాకినాడ వారి తితిక్ష, శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్ విజయవాడ వారి అనస్వరం నాటిక లను ప్రదర్శించారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రతినిధిగా సుబ్రహ్మణ్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య అధికార ప్రతినిధిగా మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్రహ్మణ్యం శర్మ ఎన్నికయ్యారు. ఏలూరులో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సుబ్రహ్మణ్యంను శ్రీ ఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు అభినందించారు.

మే 20న కార్మిక సమ్మె

భీమవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రం లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా మే 20న సమ్మె నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాలు నిర్ణయించాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం సీఐటీయు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీఐటీయు నాయకులు రాజారామ్మోహన్ రాయ్, వాసుదేవరావు, జెఎన్వీ గోపాలన్, పీవీ ప్రతాప్, కళ్యాణి, అంజనేయులు పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

పాలకోడేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం వేంద్ర గ్రామంలో కొండయ్య చెరువు తవ్వుతున్న ఉపాధి కూలీలకు పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణమోహన్ మజ్జిగ పంపిణీ చేశారు.

రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : గోపాలన్

భీమవరం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మొగల్తూరు మండలంలో ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కూలీలకు ప్రభుత్వం పదిలక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఉపాధి పథకంలో పనిచేస్తుండగా మరణిస్తే 50వేలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం సరైనది కాదన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.